# ఏకాంతం

- ఆర్. దమయంతి

'ప్రేమంటే - ఒకరు లేకుండా ఒకరు చచ్చిపోవడమే కాదు ... ఒకర్ని విడిచి మరొకరు బ్రతకలేక పోవడం కూడా ...''



''మమ్మీ ... నేనర్జంట్‌గా పెళ్ళి చేసుకోవాలి'' సుడిగాలి వార్తలా చెప్పింది రమ్య.

''ఏం? ... కిరణ్‌కి ఉద్యోగం వచ్చేసిందా?'' సోఫా కవర్లు మారుస్తూ అడిగింది జలంధర.

'కిరణా? ... ఎవడతను?' అంటూ విసురుగా కూర్చుంది.

''ఎవరా!? ... 'నా హార్ట్ ... నా బీట్ ... నా లైఫ్ ... నా బ్రీత్' అంటూ ఆ మధ్య ఇంగ్లీష్ పొయిట్రీ రాసి అంకితమిచ్చాడు చూడు ... ఆ కిరణ్ ... నీ ఇంజనీర్ హైటెక్ ప్రియుడు'' నవ్వుతూ అంది.

''ఇప్పుడు నాకతనితో ఎలాంటి బంధమూ ... సంబంధమూ లేవు ... అతడొక మాయగాడు ... మోసగాడు ... ఛీట్ ... వుమనైజర్ ...'' కోపంగా చెప్పింది ...

''ఏమైందిరా ...?'' తల్లి లాలనగా అడిగేసరికి - రమ్య కరిగి పోయింది - అప్పటిదాకా బిగపట్టుకున్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబి కింది - ''మమ్మీ నేను మోసపోయాను -'' అంటూ బోరుమంది.

జలంధర గుండె గుభేల్మంది.

కిరణ్, రమ్యల స్నేహం ... చనువు ... ఫ్రెండ్షిప్‌కి మించిన బంధం తనకి తెల్సు. కానీ పెళ్ళి వరకూ ... దూరాన్ని ఎలాగో మానేజ్ చేసుకోవాలి ... చేసుకోకపోతే ఎదురయ్యే సోషల్, సైకలాజికల్ ప్రాబ్లమ్స్ గురించి కూతురికి చెప్పానే వుంది. కొంపదీసి తొందర పడ్లేదు కదా-?!

''రమ్యా? నిన్ను కానీ ... కిరణ్'' అంటూ ఆగిపోయింది. ఆ తర్వాతది ఎలా అడగాలో అర్థం కావట్లేదామెకి ... డెలికసీగా వుంది ... అది గ్రహించి చెప్పింది రమ్య.

''అలాంటిదేం జరగలేదు మమ్మీ. కానీ కిరణ్ లాంగ్‌డ్రైవ్‌లు తీసుకెళ్తున్నాడు ... లోన్లీ ప్లేసెస్‌లో గడుపుదామంటాడు ... ఈ మధ్య కొంచెం అడ్వాన్స్ అవుతున్నాడు ... మొన్న చాలా ప్రెజర్ చేస్తే 'నో' అని ఖచ్చితంగా చెప్పేశాను ... అప్పుడు కామ్‌గానే వున్నాడు ...

కానీ ... నిన్నట్నుంచి ఆ నీరూని వేసుకుని తిరుగుతున్నాడు ... ఇద్దరూ కలిసే బర్గర్ తింటారు ... ఒకే కూల్‌డ్రింక్‌ని కలిసి తాగుతారు ... సిగరెట్‌ని షేర్ చేసుకుంటారు ... అది అతన్ని అతుక్కుపోయి కూర్చుంటే ... ఇతగాడేమో ఆకాశంలో బండి నడుపుతాడు ... ఫ్రెండ్సందరూ 'ఐపిటీ యూ' అంటూ నావైపు చూస్తున్నారు ...'' ఉక్రోషంగా మళ్ళీ బిగ్గరగా ఏడ్చింది రమ్య ...

కూతురి బాధనర్థం చేసుకుంటూ పక్కనే కూర్చుని అడిగింది జలంధర.

''మరి నువ్వేమీ అడగలేదా కిరణ్ణి?''

''అడిగా ... ఏవన్నాడో తెల్సా మమ్మీ ... నీతూ నొదిలేస్తా మరి నువ్ 'కోఆపరేట్' చేస్తావా?' అన్నాడు మమ్మీ'' అంటూ తల్లి వొళ్ళో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది రమ్య.

ప్రపంచంలో ఏ స్త్రీ కూడా తన మగాడు తనకు తప్ప మరిదేనికి బానిస అయినా సహించ లేదు. అందులో స్త్రీ లోలుడైతే అస్సలు

భరించలేదు. రమ్య పరిస్థితీ ప్రస్తుతం అంతే.

''పోనీ ... పిల్చి అడుగుదామా...?'' ఆమె మాట పూర్తి కాకుండానే చివ్వున లేచి కూర్చుంటూ - ''నో మమ్మీ -'' ఖచ్చితంగా చెప్పేసింది.

''పెళ్ళికి ముందు అతని కోర్కె తీర్చలేదని ... కసితో కక్షతో నా కళ్ళ ముందే మరో దానితో వేషాలేస్తున్న ఇతగాడు .. రేపు పెళ్ళయి, సెక్సయి ... మోజు తీరాక ... ఆ తర్వాత మాత్రం మరో ఆడదాన్తో సంబంధం పెట్టుకోడని గ్యారంటీ ఏవిటి మమ్మీ ...?

నన్ను ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేయడని భరోసా ఏమిటి!?

నేనతన్ని గాఢంగా ప్రేమించింది నిజం ... ఒకటి కాదు రెండు కాదు ... ఎనిమిదేళ్ళుగా ... నా ప్రాణంలో ప్రాణంగా ... నాకున్న ఒకే ఒక్క ప్రపంచంగా ... నేను కలలు కంటానికే అతడు పుట్టాడన్నట్టుగా ప్రేమించా ...

కానీ ... ఇప్పుడు ... ఇప్పుడు నాకొద్దు మమ్మీ. అతడు కానీ, అతని తాలూకు గుర్తులు గానీ ... అస్సలతని వునికి కానీ ... నాకొద్దు ... నాకు తెలీదు ... ప్లీజ్ మమ్మీ ట్రయ్ టు అండర్ స్టాండ్ మై పెయిన్ ... నే దూరంగా వెళ్ళిపోవాలి ... పెళ్ళి చేసుకుని వెళ్ళిపోవాలంతే ...'' చివరి నిర్ణయంగా చెప్పేసింది. జలంధరకి పూర్తిగా అర్థమైపోయింది.

రమ్య మనస్తత్వం, సున్నితత్వం ఇవేకాదు కఠినత్వం కూడా ఆమెకి బాగా తెలుస్.

తను ప్రేమించిన వాడిని ప్రాణంగా భావిస్తుంది. దేవునిక్కూడా ఇవ్వనంత ఇంపార్టెన్స్ ఇస్తుంది.

ద్వేషిస్తే - సృష్టిలో అదెంతటి విలువైందైనా పగలకొట్టేస్తుంది. మామూలుగా కాదు. దాని రూపమే లేనంతగా ... కన్పించనంతగా ...

రమ్య మనస్తత్వం గురించి ఓసారి సైకియాట్రిస్ట్‌ని కల్సింది జలంధర.

అది శాడిజం కాదని నిర్ధారించుకుంది.

'తను తీసుకున్న ఏ నిర్ణయమైనా ఫరవాలేదు. ఆమె హేపీగా వుంటోందా లేదా అనేది గమనించండి' చెప్పి పంపింది సైకియాట్రిస్ట్.

అందుకే రమ్యని అడిగింది -

''వేరే అతన్ని పెళ్ళి చేసుకోవటం నీకిష్టమేనా? ... హేపీగా వుండగలవా ... నీ జీవితాంతం?'' ఆ ప్రశ్నకి -

తల్లి వైపు సూటిగా చూస్తూ నొక్కి చెప్పింది ''హేపీనెస్ కోసమే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నా మమ్మీ -''

''సరే. నాన్న గారితో చెప్పి వెంటనే మారేజ్ సెటిల్ చేయిస్తా ... సరేనా?!''

''ఓ. కే మమ్మీ థాంక్యూ -'' అంటూ లోపలికెళ్ళిపోయింది. రమ్యవైపే చూస్తూ గట్టిగా నిట్టూర్చింది జలంధర.

☆ ☆ ☆

రమ్య మ్యారేజ్ సెటిలైపోయింది.

అబ్బాయి కంప్యూటర్ ఇంజనీర్. న్యూజెర్సీలో వుంటాడు. ఫస్ట్ వీక్‌లో వచ్చాడు. సెకండ్ వీక్‌లో ఖాయమైపోయింది. థర్డ్ వీక్‌లో పెళ్ళి ... ఆ వెంటనే రమ్యని అమెరికాకి తీసుకెళ్ళిపోతాడు....

అదీ సంగతి -

☆ ☆ ☆

కర్మాగారాలు తగలబడిపోతుంటే - ఫైరింజన్లొచ్చి ఆగినట్టు ... కిరణ్ బైక్‌ని స్టాండేయబోయాడు కానీ అది పడిపోయింది ... దానికంటే ముందే అతను తుఫానులా లోపలికి .. రమ్య రూంలోకి పరిగెత్తాడు..

రమ్య నెయిల్ పాలిష్ వేసుకుంటోంది నింపాదిగా ...

పెళ్ళి కూతురి చేతులు ఎర్రటి గోరింటాకు డిజైన్‌తో మెరిసిపోతున్నాయి ...

''రమ్యా ... ఏమిటిదంతా ...'' అయోమయంగా అడిగాడు కిరణ్ ...

''పెళ్ళి. నా పెళ్ళి ... తెలీదా?''

''అందుకే ... అందుకే వచ్చాను రమ్య ప్లీజ్ ... నువ్వీ పెళ్ళి చేసుకోవద్దు .. నువ్ నన్నిడిచి వెళ్ళటానికి వీల్లేదు ...''

''ఔనా! ...''

ఆమె వ్యంగ్యాన్ని పట్టించుకునే పరిస్థితిలో లేడు కిరణ్ ....

''రమ్యా ప్లీజ్ ... ప్లీజ్ అర్థం చేసుకో ... నిన్ను నేను హర్ట్ చేసింది నిజమే ... కానీ ... నువ్వింత పనిష్మెంట్ ఇస్తే మాత్రం ... నేను బ్రతకలేను ... రమ్యా ... ఈ పెళ్ళి ఆపెయ్ ... నా కోసం .. నా కోసం రమ్యా ...'' చిన్న పిల్లాడిలా ఆత్రంగా ... అమాయకంగా ... ఆర్ద్రంగా అడుగుతున్నాడు ...

ఫెళ్ళున నవ్వింది రమ్య ... ''నీ కోసం పెళ్ళాపుకోవాలా ... ఎందుకట?''

''ఎందుకంటే నేన్నిన్ను ప్రేమించాను రమ్యా ...'' అతని కళ్ళెంట నీళ్ళొచ్చాయి.

''ఛా ... నిజమా? నువ్ ప్రేమించావ్ సరే ... నేన్నిన్ను ప్రేమించఖర్లేదా?''

''నువ్ ప్రేమించావో లేదో నీ మనసునడుగు చెప్తుంది....

నీ ఆత్మనడుగు చెప్తుంది ...

నువ్వూ, నేనూ కలిసి గడిపిన కాలాన్నడుగు ... ప్రతి క్షణమూ ఓ యుగంలా రుజువై చెప్తుంది... రమ్యా నిజ్జంగా చెప్తున్నా ... అయ్ లవ్ యూ ... అయ్ కాన్ట్ ఇమాజిన్ మి విథౌట్ యూ ... నాటీవెన్ ఎ సెకన్ -'' ఆమె పాదాల దగ్గర మోకరిల్లాడు ...

రెక్‌లెస్‌గా అక్కడ్నుంచి కదిలి ఫోనందుకుంది రమ్య. డయల్ చేసింది.

అవతల్నుంచి రెస్పాన్స్ రాగానే స్పీకర్ ఆన్చేసింది - ''హలో'' అపరిచితుని గొంతు.

''హలో - రమ్యా హియర్'' నవ్వుతూ చెప్పింది.

''హాయ్ రమ్యా ... వాట్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రయిజ్ ... ఏవిటి సంగతి?'' అతని గొంతు ఉత్సాహంగా వుంది.

''అయ్ లవ్ యూ ... ఆయ్ లవ్ యూ కృష్ణా''

''ఐ టూ రమ్యా -'' అది పెళ్ళి కొడుకు గొంతని గుర్తుపట్టాడు కిరణ్.

''మళ్ళీ కలుస్తా ... బై -'' ఫోన్ పెట్టేసింది రమ్య.

'చూసింది, విన్నదీ చాలుకదా! ఇక వెళ్ళు' అన్నట్టుంది రమ్య ధోరణి.

వొళ్ళు మండిపోయింది కిరణ్‌కి.

రమ్య మీదికెళ్ళి దగ్గరగా ... ముఖంలో ముఖంపెట్టి కసిగా చెప్పాడు కిరణ్ ...

''నువ్ వాడ్ని పెళ్ళి చేసుకున్నావంటే ... చూడు ...''

''ఏం? ఏం చేస్తావ్?''

''చంపేస్తా ... నిన్ను కాదు. వాడ్ని ...''

''అంతకు ముందు నేనేం చేస్తానో తెల్సా ...? పోలీస్ కంప్లయింట్ ఇచ్చి నిన్ను జైల్లో తోయించి ... అప్పుడు పెళ్ళి చేసుకుంటా ... ఏం చేసుకుంటావో చేసుకో ఫో -'' రమ్య బెదిరింపుకి నిర్లక్ష్యానికి కిరణ్‌లో ఆవేశం సముద్రమైంది.

''నిన్నూ ... ఛీ'' అంటూ చెంప ఛెళ్ళుమన్పించాడు ... రమ్య కళ్ళు తిరిగి పడిపోయింది ...

''నీకు బుద్ధుందా?'' జలంధర అప్పుడే అక్కడికి వచ్చి అరిచింది కిరణ్‌ని.

కిరణ్ మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ వచ్చి ... తప్పు చేసిన వాడిలా తలొంచుకుని ''సారీ ఆంటీ ... సారీ ... కానీ ...'' అంటూ జలంధర పాదాలమీద పడి ఏడ్చేశాడు ... ''అంటీ ... రమ్య నాకే సొంతమవ్వాలి ... రమ్య నాది ... నాది ... రమ్య లేకుండా నేను బ్రతకలేను ఆంటీ ... ప్లీజ్ ఈ పెళ్ళి ఆపించండి ఆంటీ ... ఈ పెళ్ళే గనుక అయితే ... నేను బ్రతకలేను ఆంటీ -'' అపురూపమైన వస్తువు చేజారిపోతుంటే ... దక్కించుకోడానికి చివరి క్షణంలో పడే ఆశ, ఆత్రం, నిరాశ, ఓటమి, నిస్పృహ అన్నీ కలగలిపి ఇదని చెప్పలేని ఓ విషాద స్థితిలో వున్నాడు కిరణ్ ...

అతని మీద కోపం కాస్తా జాలిగా మారింది. కిరణ్ చిన్నప్పట్నుంచి తెల్సు ఆమెకు. అతని నేచర్, తెలివితేటలు, బిహేవియర్, ఫామ్లీ బాక్‌గ్రౌండ్ అన్నీ నచ్చే రమ్యని యాక్సెప్ట్ చేసింది.

కానీ ఇప్పుడేమీ ఆమె చేతిలో లేదు. రమ్య అతన్ని మాత్రం పెళ్ళి చేసుకోదు. అందుకే కన్‌సర్న్‌గా చెప్పింది ''చూడు కిరణ్! జరిగిందేదో జరిగిపోయింది. అంతా మర్చిపో. ఆడది - రమ్యే నీ ప్రేమొద్దనుకుని పెళ్ళి చేసుకుంటుంటే ... నువ్వేంటీ ఆడపిల్లలా ఇలా ఏడుస్తూ ... బేలగా ... అబలలా ... ఊ?'' అంటూ ఓదార్చింది.

కానీ ఆమెకి తెలుసు. ప్రేమ విషాదమైతే ఆడకైనా మగకైనా హృదయంతో బాటు కళ్ళూ ద్రవిస్తాయనీ ... స్రవిస్తాయనీ ... అతన్ని ఇంకొంచెంసేపు ఓదార్చి పంపేసింది.

నిరాశతో వెళ్ళిపోయాడు...

రమ్యకి పెళ్ళయిపోయింది. భర్తతో అమెరికా వెళ్ళిపోయింది.

☆☆☆

పిడుగులాంటి వార్తకి జలంధర కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయి. నుదురంతా స్వేదంతో నిండిపోయింది ...

''కిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు ... చచ్చిపోయాడు ... ప్రేమకోసం ... రమ్యలేని జీవితాన్ని ఒద్దనుకొని శాశ్వతంగా ఈ ప్రపంచాన్నొదిలేసి వెళ్ళిపోయాడు ...''

హార్ట్ ఎటాక్‌లాంటి వార్తకి నిలువునా వొణికిపోతోంది ...

ఇంతలో ఫోన్ ...

లిఫ్ట్ చేస్తుంటే చేయి వొణికింది -

''మమ్మీ -'' రమ్య ఫోన్.

''ఏం ... టమ్మా ...'' తడబడింది జలంధర గొంతు....

''మమ్మీ .. నా మనసేం బావోలేదు మమ్మీ ... బోర్‌గా ... లోన్లీగా వుంది ...'' క్షణం నిశ్శబ్దం తర్వాత అంది రమ్య - ''మమ్మీ ... నా కెందుకో ... కిరణ్ గుర్తొస్తున్నాడు మమ్మీ ... బాగా గుర్తొస్తున్నాడు... నా కోసం ఏడుస్తున్నట్టు ... పిచ్చివాడై పోయినట్టు కల్లో కొస్తున్నాడు ... ''ఒక్కసారి ఫోన్జేసి ఎలా వున్నాడో కనుక్కుంటావా మమ్మీ ప్లీజ్...'' రమ్య గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. పశ్చాత్తాపం కావచ్చు.

''అలాగే ... నువ్వేం ఆలోచించకు ...'' పొడిగా జవాబిచ్చి ఫోన్ పెట్టేసింది. జలంధర వెక్కి వెక్కి లోపల్లోపల ఏడుస్తోంది - 'కిరణ్ నీ కోసం చచ్చిపోయాడు' అని రమ్యకెలా చెప్పడం ...?

☆☆☆

మర్నాడే మళ్ళీ ఫోన్ - ''హలో ఆంటీ'' అల్లుడు గారి గొంతది.

''రమ్య చాలా బెంగపడింది. మిమ్మల్ని చూడాలనంటోంది ... టికెటంతా రెడీ అయిపోయింది. రేపే బయల్దేరి వస్తోంది.''

జలంధర గుండె గుభేల్మంది ...

రమ్య వచ్చి కిరణ్‌ని అడిగితే ... నిజం తెలిస్తే ...!?

☆☆☆

''ఇదసలు ఎలా జరిగింది?'' రమ్య తండ్రి మతి తప్పిన వాడిలా అడుగుతున్నాడు...

''ఏమో సార్ ... మధ్యరాత్రిలో హార్ట్ ఫెయిలయిందని చెప్తున్నారు డాక్టర్లు'' అంటూ అఫీషియల్స్ రమ్య శవాన్ని అప్పగించారు ...

జలంధర్‌కి స్పృహ తప్పిపోయింది.

ఎంత సేపయిందో - మెలకువొచ్చి చూసింది. పక్కనే భర్త సర్వం పోగొట్టుకున్న వాడిలా విషాదంలో కన్పిస్తున్నాడు ...

భర్త వైపు చూస్తూ దగ్గరికి రమ్మని సైగ చేసింది.

''రమ్య శవం వుంచారా ...?'' మెల్లగా అడిగింది ... ఏడుస్తూనే.

''నువ్ చూస్తావని ఆపాం ... ఎక్కువ మాట్లాడొద్దన్నారు డాక్టర్లు నిన్ను'' ఆయన దుఃఖంతో కళ్ళు తుడుచుకుంటున్నాడు ...

''చివరిసారిగా మాట్లాడనీయండి ... రమ్యని కిరణ్ సమాధి పక్కనే ... పక్కనే ధహన సంస్కారాలు చేయించండి ... వాళ్ళిద్దరూ ...'' అంటూ ఇంకేం చెప్పలేని దాన్లా కళ్ళు మూసుకుంది. నిశ్శబ్దంగా కన్నీళ్ళు రాలాయి ...

ప్రేమికులకు ఒకరి గుండె చప్పుళ్ళు మరొకరికి బాగా తెలుస్తాయి... దగ్గరగా వున్నప్పుడు మాత్రమే కాదు ... మైళ్ళు ... మైళ్ళ దూరంలో వున్నా కూడానట ...

## నమ్మకం నా బలం!

మాజీ విశ్వ సుందరితో ఓ బుల్లి ఇంటర్వ్యూ:

★ మీలో కొట్టొచ్చే లక్షణం?
- నాకుండే విశ్వాసం.

★ మీకుండే భయం?
- సరిగ్గా ఉండాల్సింది తప్పు అయితేనో?

★ మీ వీక్‌నెస్?
- నా కోపం.

★ మగాడిలో నచ్చేది?
- అతగాడి సుపీరియారిటీ.

★ మరి నీకుండే బలం?
- నా నమ్మకం!

